
E-KABURU
E-PAPER
# ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
04-4-2025 శుక్రవారం | పేజీలు–6 | హైదరాబాద్ | ekaburu.com

# కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం..
# సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



- హైకోర్టు రిజిస్ట్రార్‌కు సుప్రీం ఆదేశాలు – భూ స్థితిగతులపై మధ్యంతర నివేదిక సమర్పణకు ఆదేశాలు
- హైకోర్టు విచారణపై స్టే లేదు – తెలంగాణ ప్రభుత్వ వాదనపై సుప్రీంకోర్టు స్పష్టత
- 400 ఎకరాల భూమిపై వివాదం – టీజీఐఐసీకి భూమి కేటాయింపు, ప్రభుత్వ ప్రకటన
- అటవీ భూమి అంశం – ప్రతిపక్షాల ఆరోపణలు, అక్రమ నిర్మాణాలపై నిరసన
- వన్యప్రాణుల రక్షణ – చెట్ల నరికివేతను నిలిపివేయాలన్న సుప్రీంకోర్టు ఆదేశం

**ఈ-కబురు:**
కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు గురువారం కీలక ఆదేశాలిచ్చింది. స్థలాన్ని సందర్శించి మధ్యంతర నివేదిక ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్‌ను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. ఇవాళ మధ్యాహ్నం3:30 గంటల లోపు నివేదిక ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రార్కు స్పష్టం చేసింది. హైకోర్టు విచారణపై స్టే ఇవ్వడం లేదని సుప్రీం క్లారిటీ ఇచ్చింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు చెట్లు నరకొద్దని తెలంగాణ సీఎస్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

హెచ్‌సీయూ భూముల వ్యవహారం సుప్రీం కోర్టుకు వెళ్లడంతో ఈ అంశం తెలంగాణలో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అత్యవసరంగా విచారణ చేపట్టాలని పిటిషనర్ తరపు న్యాయవాదులు కోరారు. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఎదుట మెన్షన్ చేశారు. హైకోర్టు రిజిస్ట్రార్ నివేదిక ఇచ్చాక మధ్యాహ్నం 3 గంటల 45 నిమిషాలకు విచారణ చేపడతామని సుప్రీం కోర్టు తెలిపింది. కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోందని తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను తరువాయి 2లో



## కంచ గచ్చిబౌలి భూముల అంశం.. విచారణ ఏప్రిల్ 7కు వాయిదా

**నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై విచారణను తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.**

2లో



## వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- అనుకూలంగా 288... వ్యతిరేకంగా 232 ఓట్లు
- 14 గంటలకు పైగా సుదీర్ఘ సమావేశం
- తెల్లవారుజాము వరకూ చర్చ
- విమర్శలు, ప్రతి విమర్శలతో మార్మోగిన సభ
- ప్రభుత్వంపై ఆరోపణలను తిప్పికొట్టిన రిజిజు, అమిత్ షా
- మైనారిటీల హక్కులను హరిస్తున్నారని ప్రతిపక్షాల ధ్వజం

3లో



## తెలంగాణ సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాల యత్నం

**కంచ గచ్చిబౌలిలోని భూముల వివాదం నేపథ్యంలో తెలంగాణ సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాలు యత్నించాయి**

## హైదరాబాద్ లో భారీ వర్షం..
## అధికారులను అప్రమత్తం చేసిన సీఎం



**ఈ-కబురు**
హైదరాబాద్ లోఓ గురువారం ( ఏప్రిల్ 3) భారీ వర్షం పడింది. అరగంటపాటు కురిసిన విధ్వంసం సృష్టించింది. ఈ నేపథ్యంలో స్థానిక అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్ని డిపార్ట్‌మెంట్లను ఆదేశించారు. రోడ్లపై ఎక్కడ పడితే ట్రాఫిక్ స్థంభించడంతో... సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసి వాహనదారులు త్వరగా ఇళ్లకు చేరుకునేలా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎస్‌ను ఆదేశించారు. . అన్ని శాఖల అధికారులను అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు

తెలంగాణ వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై నీటి నిల్వలు లేకుండా ట్రాఫిక్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు లేకుండా జీహెచ్ఎంసీ, పోలీస్, హైడ్రా విభాగాలు సమన్వయంతో పని చేయాలని సీఎం ఆదేశించారు.

తెలంగాణలో గురువారం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. భారీ వర్షం, ఈదురుగాలులతో రాజధాని హైదరాబాద్ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అర గంటసేపు వర్షంతో హైదరాబాద్ రోడ్లనీ చెరువులను తలపిస్తున్నాయి. పలు చోట్ల ఈదురుగాలులతో చెట్లు విరిగిపడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి మరో నాలుగు రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

## బీఆర్ఎస్‌కు 100 సీట్లు



**బీఆర్ఎస్ నేతలతో సమావేశమైన కేసీఆర్ - ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్‌కు 100 సీట్లు ఖాయమన్న కేసీఆర్ - ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ నేతలతో సమావేశం**

2లో



## కంచ గచ్చిబౌలి భూములు ఎవరూ కొనవద్దు.. కేటీఆర్ సంచలన ప్రకటన

**ఈ-కబురు,హైదరాబాద్**
తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కంచగచ్చిబౌలి భూములను వెనక్కి తీసుకుంటామని అక్కడ ఒక్క ఇంచు స్థలం కొనుగోలు చేసినా నష్టపోతారని 2లో



2లో

## వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగంపై దాడి: సోనియాగాంధీ

## భారాస ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంలో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు

**భారాస ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.**

3లో





3లో

## భారత్‌పై అమెరికా సుంకాలు.. వాణిజ్యశాఖ ఏమన్నదంటే!



2లో

## హైదరాబాద్ సహ తెలంగాణ అంతటా దంచికొడుతున్న వానలు



2లో

## హెచ్‌సీయూ భూములపై సుప్రీంకోర్టు తీర్పు.. ప్రభుత్వానికి చెంపదెబ్బ: రఘునందన్‌రావు

## సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తాం భట్టి విక్రమార్క



**కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.**

**ఈ-కబురు,హైదరాబాద్:**
కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. న్యాయస్థానాలపై తమకు పూర్తి విశ్వాసం ఉందని.. న్యాయం తప్పకుండా గెలుస్తుందన్నారు. సుప్రీంకోర్టు అడిగిన సమాచారాన్ని గడువులోగా పంపిస్తామన్నారు. విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించవద్దని సైబరాబాద్ కమిషనర్, ఇంటెలిజెన్స్ అదనపు డీజీని ఆదేశించినట్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.


## రామాయణ గాథలు థాయ్ ప్రజల జీవితాల్లో భాగం

**భారత్, థాయ్‌లాండ్‌ల మధ్య శతాబ్దాల అనుబంధం ఉందని ప్రధాని మోదీ అన్నారు.**



**ఈ-కబురు:**
బిమ్‌స్టెక్ సదస్సులో భాగంగా ప్రధాని మోదీ థాయ్‌లాండ్ లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో భేటీ అయ్యారు. థాయ్ ప్రజల జీవితాల్లో రామాయణ ఇతిహాసంలోని గాథలు భాగమని మోదీ అన్నారు.

దక్షిణాసియా, ఆగ్నేయాసియా ప్రాంతాలకు చెందిన 7 దేశాల సమాగమం అయిన బంగాళాఖాత ప్రాంత బహుళ రంగ, సాంకేతిక, ఆర్థిక సహకార (బిమ్‌స్టెక్) సదస్సు కోసం రెండు రోజుల పాటు గురువారం మోదీ థాయ్‌లాండ్ వెళ్లారు. ప్రధానుల భేటీ అనంతరం మోదీ మాట్లాడుతూ.. "భారత్ థాయిలాండ్ మధ్య శతాబ్దాలుగా సంబంధాలు కొనసాగుతున్నాయి. సాంస్కృతిక, ఆధ్యాత్మిక సంబంధాలతో బలమైన బంధం ఏర్పడింది. బౌద్ధమతం వ్యాప్తి మన ప్రజలను అనుసంధానించింది. అయుతయ నుంచి నలంద వరకు మేధావులు రాకపోకలు 2లో



3లో

## ట్రంప్ సుంకాలు.. ఏం చేయాలను కుంటున్నారు..? రాహుల్ గాంధీ



3లో

## కేసీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట

## కోల్‌కతా చేతిలో చిత్తుగా ఓడిన హైదరాబాద్

6లో



## వక్ఫ్ సవరణ బిల్లు
# రాజ్యాంగంపై దాడి

**వక్ఫ్ సవరణ బిల్లుపై కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు.**

**ఈ-కబురు:**
వక్ఫ్ (సవరణ) బిల్లు 2025పై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లుతో సమాజంలో శాశ్వత విభజనను తీసుకురావడానికి భాజపా ప్రయత్నిస్తుందని విమర్శించారు. గురువారం సంవిధాన్ సదన్‌లో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పార్టీ ఎంపీలను ఉద్దేశిస్తూ ఆమె మాట్లాడారు.
'వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగంపై దాడి చేయడమే. దిగువ సభలో ఈ బిల్లును తొక్కేశారు. మోదీ ప్రభుత్వం విద్య, పౌర హక్కులు, స్వేచ్ఛ, సమాఖ్య నిర్మాణం, ఎన్నికల నిర్వహణ ఏదైనా దేశాన్ని అగాధంలోకి లాగుతోంది. రాజ్యాంగం అనేది కేవలం కాగితాలకే పరిమితమైంది. దాన్ని కూడా కూల్చేయాలనేదే వారి ఉద్దేశమని మాకు తెలుసు. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను, వారి ఉద్దేశాలను బహిర్గతం చేయాలి. ఏది సరైనది, ఏది న్యాయబద్ధమైనది అనేది ప్రజలకు తెలియజేసేందుకు అందరం కలిసి మన పోరాటాన్ని కొనసాగించాలి' అని సోనియా పేర్కొన్నారు. ఈసందర్భంగా రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడానికే ఒకే దేశం, ఒకే ఎన్నిక బిల్లును తీసుకొస్తున్నారని ఆరోపించారు. దీన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు.

**అనురాగ్ ఠాకూర్ ఆరోపణలు.. పుష్ప డైలాగ్‌తో కౌంటర్ ఇచ్చిన ఖర్గే**
ఇక, పార్లమెంటులో ప్రతిపక్షాలను మాట్లాడేందుకు సమయం ఇవ్వడం లేదని సోనియా ఆరోపించారు. కాంగ్రెస్ సభ్యులు తమ సమస్యలను లేవనెత్తనివ్వకుండా సభలో గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. భాజపా సభ్యులు కాంగ్రెస్ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలని టార్గెట్ చేశాయన్నారు. వారి వైఫల్యాలను ఎత్తిచూపే విషయంలో పార్టీ ఎంపీలు అంతే దూకుడుగా వ్యవహరించాలని ఈసందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పార్టీ ఎంపీలందరూ హాజరయ్యారు.

**వక్ఫ్ (సవరణ) బిల్లు-2025 బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి.**

## రామాయణ గాథలు
### థాయ్ ప్రజల జీవితాల్లో భాగం

**మొదటి పేజి తరువాయి**
సాగించారు. రామాయణ గాథలు థాయ్ ప్రజల జీవితాల్లో ఒక భాగమయ్యాయి. సంస్కృతం, పాళీ భాషల ప్రభావం నేటికీ ఇరువురి సంప్రదాయాల్లో ప్రతిబింబిస్తుంది. నా పర్యటన సందర్భంగా 18వ శతాబ్దపు రామాయణ కుడ్య చిత్రాల ఆధారంగా ఒక స్మారక స్టాంపును విడుదల చేసిన థాయ్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను'' అని హర్షం వ్యక్తంచేశారు.



భారత్ యాక్ట్ ఈస్ట్ పాలసీ, ఇండోపసిఫిక్ విజన్‌లో థాయ్‌లాండ్‌ది కీలక పాత్ర అని మోదీ అన్నారు. తమ రెండు దేశాలు అభివృద్ధి వాదాన్ని సమర్థిస్తాయని, విస్తరణ వాదాన్ని కాదని చైనాను ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఇటీవల సంభవించిన భూకంపంలో మృతి చెందిన వారికి భారత్ తరపున సంతాపం తెలియజేశారు. ఈ సాయంత్రం ఆయన బిమ్‌స్టెక్ సదస్సులో పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తోపాటు థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. బ్యాంకాక్ పర్యటనలో భాగంగా మోదీ పదవ 'రామ'గా కూడా ప్రసిద్ధుడైన థాయ్ రాజు మహా వజిరలాంగ్‌కోమ్‌ను కలుస్తారు.

## కంచ గచ్చిబౌలి భూములు ఎవరూ కొనవద్దు..
# కేటీఆర్ సంచలన ప్రకటన

**మొదటి పేజి తరువాయి**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆ 400 ఎకరాల భూమిని గ్రీన్ జోన్ గా ప్రకటించి హైద్రాబాద్ లోనే బెస్ట్ ఎకో పార్క్ తయారు చేసి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కానుగా ఇస్తాం. ఇది మా పెద్దలు కేసీఆర్ తీసుకున్న నిర్ణయం అని వెల్లడించారు. ఇవాళ తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్ ఈ భూముల విషయం రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ భూములు హైదరాబాద్ ప్రజలకు చెందినవని ఇది హైదరాబాద్ భవిష్యత్ కోసం చేస్తున్న పోరాటం అన్నారు.

యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనలు పట్టించుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్ లా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఈ భూములను కాపాడి హైదరాబాద్ కు మణిహారంగా ఉండేలా ఏకోపార్క్ అభివృద్ధి చేయడం బీఆర్ఎస్ పార్టీ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. మరి కాంగ్రెస్ విధానం ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో కోట్ల మొక్కలు నాటి హరిత విప్లవానికి తెరలేపామని హైదరాబాద్ కు గ్రీన్ సిటీ అవార్డు వచ్చిందన్నారు. రాష్ట్రంలో పేరుకే ప్రజాపాలన, ఎక్కడా ప్రజాస్వామ్య స్ఫూర్తి కనిపించడం లేదని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి కోర్టులంటే గౌరవం లేదని కోర్టులు చెప్పినా వినకుండా అర్ధరాత్రులు చెట్లను నరికివేస్తున్నారని ఆరోపించారు. ఇవి నిజంగా ప్రభుత్వ భూములే అయితే దొడ్డితారిలో ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. మంత్రులు తెలిసి తెలియక మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి మెప్పుకోసం మాట్లాడేవారితో మాకెలాంటి ఫికర్ లేదన్నారు. ప్రభుత్వం ఏదైనా నిర్మించాలనుకుంటే ఫోర్త్ సిటీలో నిర్మించాలన్నారు.

## కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం..
# సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**మొదటి పేజి తరువాయి**
సింఘ్వీ సుప్రీం కోర్టుకు విషయాన్ని వెల్లడించారు. అయితే.. హైకోర్టులో జరిగే విచారణపై తాము ఎలాంటి 'స్టే' ఇవ్వడం లేదని సుప్రీంకోర్టు సింఘ్వీకి స్పష్టం చేసింది.

కంచ గచ్చిబౌలి గ్రామ సర్వే నంబర్ 25లోని 400 ఎకరాల ప్రభుత్వ భూమి హక్కులను టీజీఐఐసీకి బదలాయిస్తూ ప్రభుత్వ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి 2024 జూన్ 24న ఉత్తర్వులు జారీ చేశారు. శేరిలింగంపల్లి మండల రెవెన్యూ అధికారులు ఆ 400 ఎకరాల భూమికి సంబంధించి పంచనామా నిర్వహించి 2024 జులై 1న టీజీ ఐఐసీకి అప్పగించారు. అప్పటినుంచి ఆ 400 ఎకరాల భూమి ప్రభుత్వం స్వాధీనంలో ఉంది. కొన్ని మీడియాల్లో వస్తున్నట్టు



ఇందులో అటవీ భూమి లేదు. రెవెన్యూ రికార్డుల్లోనూ ప్రభుత్వ భూమిగానే ఉంది.

కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఇప్పటికే కీలక ప్రకటన చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలిలో టీజీఐఐసీకి కేటాయించిన 400 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నది. ఇందులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి అంగుళం భూమి కూడా లేదని స్పష్టం చేసింది.

కంచ గచ్చిబౌలి గ్రామంలో దాదాపు 400 ఎకరాల అటవీ భూమిని అక్రమంగా క్లియర్ చేసి, చెట్లను నరికేస్తున్నారని, దీని వల్ల అరుదైన చెట్లు, సరస్సులు, ప్రత్యేకమైన రాళ్ల నిర్మాణాలు దెబ్బతింటున్నాయనేది ప్రతిపక్షాల వాదన. తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐసీ) ఆక్రమణలకు పాల్పడుతోందని, ఆ భూముల్లోని చెట్లు, వన్యప్రాణులకు ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.

# బీఆర్ఎస్‌కు 100 సీట్లు

**ఈ-కబురు :**
వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ బీఫారాలపై పోటీ చేసే వారంతా సునాయసంగా గెలిచే పరిస్థితి ఉందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే వంద సీట్లు ఖాయమని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అన్నారు. ఓ సంస్థ హైదరాబాద్, రంగారెడ్డి మినహా 90 నియోజకవర్గాల్లో సర్వే చేయిస్తే బీఆర్ఎస్ 76 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని తేలిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పనైపోయిందని ఒకటి, రెండు చోట్ల బీజేపీ ఉన్న లెక్క కాదని అన్నారు.

పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో ఎర్రవెల్లిలోని తన నివాసంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 27వ తేదీన వరంగల్ ఎల్కతుర్తిలో జరగనున్న బహిరంగసభ, పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణపై సమావేశంలో చర్చించారు. వివిధ అంశాలకు కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు. అటు బీఆర్ఎస్ రజతోత్సవ పాటను కేసీఆర్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కేసీఆర్ నేతలతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చాలా త్వరగా బదనాం అయిందని,



తన రాజకీయ జీవితంలో ఇటువంటి ప్రభుత్వం, పాలనను చూడలేదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో అందిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇప్పుడు ప్రజలు కోల్పోయారని అందుకే తమను మళ్లీ కోరుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు నష్టపోయిన ప్రజలు గతంలో మంచి ఇచ్చిన పార్టీనే కోరుకుంటారు తప్ప ఇంకొకరిని కాదన్నారు. రాష్ట్రంలో బీజేపీ గురించి ప్రజలు ఆలోచించరని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

పార్టీ నేతలంతా నిత్యం ప్రజల్లో ఉండాలని వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కేసీఆర్ సూచించారు. మహిళా రిజర్వేషన్లను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్‌లో మహిళా నాయకత్వాన్ని బలోపేతం చేయాలని తెలిపారు. బీఆర్ఎస్ నేతలకు తెలంగాణ రాష్ట్రం సొంతబిడ్డ లాంటిదని, బిడ్డ బాగోగులు తప్ప ఇంకోటి ముఖ్యం కాదని పేర్కొన్నారు. కానీ, మిగతా పార్టీలకు అలా ఉండదని, వారికి పదవుల కోసం రాజకీయం మాత్రమేనని ఆయనన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ పాట ఆవిష్కరణ : బీఆర్ఎస్ రజతోత్సవ పాటను కేసీఆర్ ఆవిష్కరించారు. పార్టీ రజతోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బండెనక బండి కట్టి.. గులాబీల జెండ పట్టి.. అని పాట రాసి పాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు బీఆర్ఎస్ ప్రస్థానంపై పాటలు, కళారూపాలు రూపొందించాలని రసమయి బాలకిషన్‌కు కేసీఆర్ సూచించారు.



## హెచ్‌సీయూ భూములపై సుప్రీం కోర్టు తీర్పు.. ప్రభుత్వానికి చెంపదెబ్బ రఘునందన్‌రావు


**హెచ్‌సీయూ భూముల విషయంలో విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు.**

**ఈ-కబురు,హైదరాబాద్:**
హెచ్‌సీయూ భూముల విషయంలో విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై హెచ్‌సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు.

'యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు కొట్టవద్దని వాల్టా చట్టం చెబుతోంది. ఒక్క చెట్టు కొట్టడానికే అనుమతి అవసరమైతే.. వందల చెట్లు ఎలా కొట్టారు? మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని అనుకున్న ప్రభుత్వానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ వంటిది'' అని రఘునందన్ పేర్కొన్నారు.

## కంచ గచ్చిబౌలి భూముల అంశం..
# విచారణ ఏప్రిల్ 7కు వాయిదా

**ఈ-కబురు,హైదరాబాద్:**
నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై విచారణను తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. ఈ భూములపై వట ఫౌండేషన్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ( హెచ్‌సీయూ) విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై తెలంగాణ హైకోర్టులో ఏప్రిల్ 2న వాదనలు కొనసాగాయి. వాదనలు విన్న ధర్మాసనం.. ఒక్కరోజు పనులు ఆపాలని ఆదేశిస్తూ పిటిషన్లపై విచారణను నేటికి వాయిదా వేసింది. ఇవాళ మరోసారి విచారణ చేపట్టింది.
ఈ కేసుకు సంబంధించి దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై కౌంటర్ దాఖలు చేసేందుకు న్యాయస్థా



నాన్ని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) గడువు కోరారు. ఏజీ విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను న్యాయస్థానం ఏప్రిల్ 7వ తేదీకి వాయిదా వేసింది. అప్పటివరకు కంచ గచ్చిబౌలి భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దని జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను న్యాయస్థానం పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## హైదరాబాద్ సహా తెలంగాణ అంతటా
# దంచికొడుతున్న వానలు

**హైదరాబాద్, ఈ-కబురు :**
తెలంగాణలో పలు జిల్లాలలో వాతావరణం ఒక్కసారిగా మారింది. గురువారం మధ్యాహ్నం నుంచి ఉరుములతో, మెరుపులతో భారీగా వర్షం ఎడతెరిపి ఇవ్వకుండా దంచికొడుతోంది. దీంతో రోడ్లపై నీరు ఏరులై పారుతోంది. భారీ వర్షం కారణంగా ప్రజలు ఉక్కపోత నుంచి ఊరట పొందుతున్నప్పటికీ.. అకాల వర్షంతో రైతన్నలు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడుతుండగా.. సంగారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్‌లోనూ కుంభవృష్టి కురిసింది. హైదరాబాద్‌లో భారీ వర్షం కారణంగా రోడ్లు నీట మునిగాయి. పంజాగుట్టఖైరతాబాద్ ప్రధాన రహదారిపై మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మెర్క్యూరీ హోటల్ వద్ద ఓ కారుపై చెట్టు కూలిపోయింది. అయితే ఈ ప్రమాదం నుంచి ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు.

భూ ఉపరితలం వేడెక్కడం, ద్రోణి ప్రభావంతో క్యుములో నింబస్ మేఘాలు ఏర్పడి వర్షాలు





ఉంటాయని వాతావరణ శాఖ ముందస్తు ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఉత్తర తెలంగాణతో పాటు పలు జిల్లాల్లో వానలు పడుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో చాలా చోట్ల ఏకధాటిగా రెండు గంటలపాటు వాన కురవడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. శ్రీశైలంలోనూ నాన్ స్టాప్‌గా వానపడడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు నాగర్‌కర్నూల్‌లో పిడుగు ధాటికి ఇద్దరు మహిళలు మృతి చెందారు.

మరో మూడు నుంచి నాలుగు రోజులపాటు వర్షాలు కొనసాగుతాయని వాతావరణ కేంద్రం తెలిపింది. అయితే క్యుములో నింబస్ కారణంగా.. ఉత్తర తెలంగాణకు వడగండ్లు, ఉరుములు మెరుపులతోనూ వానలు పడొచ్చని హెచ్చరిస్తోంది. అకాల వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని రైతులకు అధికారులు ముందస్తు సూచనలు చేశారు. అయినప్పటికీ కొన్ని చోట్ల పంటలు నాశనం కాగా, కల్లాల్లో ధాన్యం తడిసి ముద్దైనట్లు తెలుస్తోంది.




## భారత్‌పై అమెరికా సుంకాలు..

# వాణిజ్యశాఖ ఏమన్నదంటే!

**సుంకాల వల్ల తలెత్తే పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని భారత వాణిజ్య శాఖ తెలిపింది.**

**ఈ-కబురు:** భారత్‌పై అమెరికా 27శాతం సుంకాలు విధించడంపై వాణిజ్య శాఖ అధికారికంగా స్పందించింది. సుంకాల వల్ల తలెత్తే పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నామని తెలిపింది. పారిశ్రామిక వర్గాలతోపాటు అన్ని భాగస్వామ్యపక్షాల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నామని తెలిపింది. అదేవిధంగా అమెరికా వాణిజ్య విధానంలో చోటుచేసుకున్న కొత్త మార్పుల వల్ల కలిగే ప్రయోజనాలను కూడా అంచనా వేస్తున్నామని తెలిపింది.

భారత్ సహా ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోత మోగించారు. ప్రత్యర్థి, మిత్ర దేశాలు అనే తేడా లేకుండా దాదాపు అన్ని దేశాలపై 10 నుంచి 50 శాతం మేర సుంకాలు విధించారు. దీనిపై ఆయా దేశాలు ఆచితూచి స్పందిస్తున్నాయి. ట్రంప్ ప్రకటన ఏకపక్షంగా ఉందని, వీటిని వ్యతిరేకిస్తున్నామని చైనా వంటి దేశాలు పేర్కొన్నాయి. అటు ఈయూ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది.



## భారాస రజతోత్సవ వేళ..

# పాట విడుదల చేసిన కేసీఆర్

**భారత రాష్ట్ర సమితి (భారాస) రజతోత్సవ వేళ ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాటను విడుదల చేశారు.**

**ఈ-కబురు,హైదరాబాద్:** భారత రాష్ట్ర సమితి (భారాస) రజతోత్సవ వేళ ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాటను విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాట రచించి పాడారు. 'బండెనుక బండి కట్టి... పోదాము రారన్నో...'' అంటూ రసమయి బాలకిషన్ రాసి, పాడిన పాటను కేసీఆర్ ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు భారాస ప్రస్థానంపై పాటలు, కళారూపాలు రూపొందించాలని రసమయి బాలకిషన్‌కు కేసీఆర్ సూచించారు. కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర నాయకులు పాల్గొన్నారు.



# తెలంగాణ సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాల యత్నం

**ఈ-కబురు,హైదరాబాద్:** కంచ గచ్చిబౌలిలోని భూముల వివాదం నేపథ్యంలో తెలంగాణ సచివాలయం ముట్టడికి వామపక్ష విద్యార్థి సంఘాలు యత్నించాయి. హెచ్‌సీయూ భూములను కాపాడాలంటూ విద్యార్థి సంఘాల నేతలు ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌లకు తరలించారు.

హెచ్‌సీయూ వద్ద ఏబీవీపీ ఆందోళన.. ఉద్రిక్తత

మరోవైపు హెచ్‌సీయూ వద్ద నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసనకారులు ఆందోళనకు దిగారు. లోపల జరుగుతున్న పనులను అడ్డుకుంటామన్నారు. హెచ్‌సీయూ ప్రధాన గేటు దూకి లోపలికి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత నెలకొంది. నిరసనల నేపథ్యంలో పెద్ద ఎత్తున పోలీసులు అక్కడ మోహరించారు.

# వక్ఫ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**సుదీర్ఘ సంవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు-2025కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్ష ఇండియా కూటమి, ఎంఐఎం తదితర పక్షాల ఆరోపణలను, విమర్శలను అధికార పక్షం గట్టిగా తిప్పికొట్టింది.**

- **అనుకూలంగా 288... వ్యతిరేకంగా 232 ఓట్లు**
- **14 గంటలకు పైగా సుదీర్ఘ సమావేశం**
- **తెల్లవారుజాము వరకూ చర్చ**
- **విమర్శలు, ప్రతి విమర్శలతో మార్మోగిన సభ**
- **ప్రభుత్వంపై ఆరోపణలను తిప్పికొట్టిన రిజిజు, అమిత్ షా**
- **మైనారిటీల హక్కులను హరిస్తున్నారని ప్రతిపక్షాల ధ్వజం**

**ఈ-కబురు,దిల్లీ:** సుదీర్ఘ సంవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు2025కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్ష ఇండియా కూటమి, ఎంఐఎం తదితర పక్షాల ఆరోపణలను, విమర్శలను అధికార పక్షం గట్టిగా తిప్పికొట్టింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మైనారిటీ వ్యవహారాల మంత్రి రిజిజు దీటుగా జవాబిచ్చారు. అధికార, విపక్ష సభ్యుల వాద ప్రతివాదాలతో సభ ప్రతిధ్వనించింది. బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం తెల్లవారుజాము 2.15 గం.లు దాటే వరకూ చర్చ, ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. 56 ఓట్ల తేడాతో ప్రతిపక్షాల అభ్యంతరాలు వీగిపోయాయి. ఇటీవల కాలంలో ఇంత సుదీర్ఘ సమయం పాటు లోక్‌సభ భేటీ కొనసాగడం ఇదే ప్రథమం.

బిల్లుకు ఎన్డీయే ప్రధాన భాగస్వామ్యపక్షాలైన తెదేపా, జేడీ(యు), శివసేన (శిందే), లోక్‌జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) మద్దతివ్వడంతో భాజపాలో ఉత్సాహం ఇనుమడించింది. మరోవైపు విపక్ష ఇండియా కూటమిలోని పార్టీలు ముక్తకంఠంతో బిల్లును వ్యతిరేకించాయి. తీవ్ర నిరసనను ప్రకటించిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తన చేతిలోని బిల్లు ప్రతిని చింపివేశారు. వైకాపా కూడా బిల్లుకు ప్రతికూలంగానే స్పందించింది. చర్చ, ఆమోదం కోసం వక్ఫ్ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది.

**పార్లమెంటు భూమినీ వక్ఫ్ ఆస్తే అంటారు!: రిజిజు**



**వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**

### చట్టాన్ని అందరూ పాటించాలి: హోంమంత్రి

వక్ఫ్ బిల్లు ముస్లింలకు మేలు చేసేదే తప్ప కీడు చేయదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. బిల్లుకు వ్యతిరేకంగా మైనారిటీలను రెచ్చగొడుతున్న వారిని తీవ్రంగా హెచ్చరించారు. భారత ప్రభుత్వం, పార్లమెంటు తీసుకువస్తోన్న ఈ చట్టాన్ని అందరూ పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. వక్ఫ్ ఆస్తులను అడ్డుపెట్టుకుని కొందరు రూ.వందల కోట్లు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆరోపించారు. వక్ఫ్ ఉన్నది నిరుపేద ముస్లింల కోసమే కానీ దొంగల కోసం కాదని చెప్పారు. బుజ్జగింపు రాజకీయాల్లో భాగంగా వక్ఫ్ చట్టానికి 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం అన్యాయమైన సవరణలు చేసిందని విమర్శించారు. ఆ మార్పులు చేయకపోతే నేటి బిల్లు అవసరమయ్యేది కాదని పేర్కొన్నారు. అవినీతి కూపాలుగా మారిన వక్ఫ్ బోర్డుల్లో సమూల మార్పులు వస్తాయని భాజపా ఎంపీ అనురాగ్ ఠాకుర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

విపక్షాల నిరసనల మధ్యే మధ్యాహ్నం 12 గంటల సమయంలో వక్ఫ్ బిల్లును ప్రవేశపెడుతూ కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంటు భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) విస్తృత మంతనాలు జరిపి బిల్లులో పలు మార్పులు చేసిందని తెలిపారు. ముస్లింల మత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని విస్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తుల నిర్వహణను సమర్థంగా, పారదర్శంగా కొనసాగించటానికి యత్నిస్తున్నామని తెలిపారు. ''దేశంలో రైల్వేలు, రక్షణ శాఖ తర్వాత భారీగా ఆస్తులుంది వక్ఫ్ బోర్డుల నియంత్రణలోనే. రైల్వేలు, రక్షణ శాఖ ఆస్తులు దేశానికి చెందుతాయి. స్వభావ రీత్యా వక్ఫ్ ఆస్తులు ప్రైవేటువే. పేద ముస్లింలకు వీటిని ఉపయోగించాలి. నిరుపేదల ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారు? రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి'' అని రిజిజు తెలిపారు. వక్ఫ్ బిల్లు పేరును...యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్ ఎంపవర్‌మెంట్, ఎఫీషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ బిల్లుగా (ఉమీద్‌యుఎంఈఈడీ)గా వ్యవహరించనున్నట్లు చెప్పారు. దీంతో పాటు 'ముసల్మాన్ వక్ఫ్ (ఉపసంహరణ) బిల్లు 2024'ను కూడా లోక్‌సభలో చర్చ, ఆమోదం కోసం కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. సుదీర్ఘ చర్చ అనంతరం విపక్షాల విమర్శలకు సమాధానమిస్తూ... 'ప్రపంచంలో మైనారిటీలకు భారత్ కన్నా సురక్షితమైన దేశం మరొకటి లేద'ని తెలిపారు. తాను కూడా మైనారిటీ వర్గానికి చెందిన వాడినేనని పేర్కొన్నారు. వక్ఫ్ ట్రైబ్యునళ్ల వద్ద చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ బిల్లు చట్టరూపం దాల్చిన తర్వాత అవన్నీ సత్వరమే పరిష్కారమవుతాయని వివరించారు. అనంతరం విపక్ష సభ్యులు పట్టుపట్టడంతో సవరణలపై సభాపతి విడివిడిగా ఓటింగ్ నిర్వహించారు.

### కాంగ్రెస్ 4డి దాడి

వక్ఫ్ బిల్లులోని పలు నిబంధనలను కాంగ్రెస్ పార్టీ ఎంపీలు తూర్పారబట్టారు. కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాలను ప్రశ్నించారు. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగొయ్ పదునైన విమర్శలతో వాగ్బాణాలు సంధించారు. వక్ఫ్ బిల్లును రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంపై దాడిగా అభివర్ణించారు. రాజ్యాంగాన్ని నీరుగార్చడం (డైల్యూట్), మైనారిటీలను అప్రతిష్ఠపాల్జేయడం (డిఫేమ్), సమాజాన్ని విభజించడం (డివైడ్), ముస్లింల హక్కులను హరించడం(డిసెన్‌ఫ్రాంఛైజ్) అనే నాలుగు (4డి) లక్ష్యాలతోనే బిల్లును తీసుకొచ్చారని విరుచుకుపడ్డారు. "వక్ఫ్‌కు ఒక ముస్లిం తన ఆస్తిని విరాళంగా ఇవ్వాలంటే కనీసం అయిదేళ్లు ముస్లిం మతాన్ని ఆచరించినట్లు ధ్రువీకరణ సమర్పించాలనే నిబంధన అత్యంత దారుణం. ప్రభుత్వం నుంచి మత ధ్రువీకరణ పత్రాన్ని పొందాల్సి రావడం నేడు దేశంలో మైనారిటీల దుస్థితికి నిదర్శనం. మత విశ్వాసాల అంశంలోకి ప్రభుత్వం ఎందుకు జోక్యం చేసుకుంటోంది?"అని గొగొయ్ ప్రశ్నించారు.

### బిల్లుపై రాహుల్ ఆందోళన

వక్ఫ్ బిల్లుపై లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ స్పందిస్తూ- ముస్లింల వైయుక్తిక చట్టాల్లో జోక్యం చేసుకుని, వ్యక్తిగత ఆస్తుల్ని లాక్కోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. ముస్లింలు లక్ష్యంగా ఆరెస్సెస్, భాజపా, వాటి మిత్రపక్షాలు చేస్తున్న దాడి ఇక్కడితో ఆగదని, భవిష్యత్తులో ఇతర మతాలవారిపైనా ఇలాగే చేస్తారని 'ఎక్స్' వేదికగా ఆందోళన వ్యక్తం చేశారు.

# భారాస ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంలో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు

**భారాస ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.**

**ఈ-కబురు,దిల్లీ:** భారాస ఎమ్మెల్యేలు పార్టీ మారిన వ్యవహారంపై సుప్రీంకోర్టు లో విచారణ జరిగింది. పది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ కొనసాగింది. తెలంగాణ స్పీకర్ కార్యదర్శి తరఫున న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. కౌశిక్‌రెడ్డి తరఫున ఆర్యామ సుందరం వాదించారు. అనంతరం ఇరు పక్షాల వాదనలను ముగించిన సుప్రీంకోర్టు తీర్పును రిజర్వులో ఉంచింది.



గురువారం జరిగిన విచారణలో తొలుత అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని కోర్టు దృష్టికి ఆయన తీసుకెళ్లారు. దీనిపై జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందిస్తూ 'మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి?' అని సింఘ్వీని ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందని.. సుప్రీంకోర్టుకు వచ్చిన తర్వాత వారి తీరు పూర్తిగా మారిపోతోందని వ్యాఖ్యానించారు.

ఇటీవల అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను కౌశిక్‌రెడ్డి తరఫు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి ప్రస్తావించారు. ''ఉప ఎన్నికలు రావు.. స్పీకర్ తరఫున కూడా చెబుతున్నా'' అంటూ ఆయన వ్యాఖ్యానించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని అన్నారని చెప్పారు. దీనిపై జస్టిస్ గవాయ్ స్పందిస్తూ ''సీఎం కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా? గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా?'' అని ప్రశ్నించారు.

మరోవైపు అభిషేక్ మనుసింఘ్వీ కలుగజేసుకుని ప్రతిపక్షం నుంచి అంతకుమించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతమని ధర్మాసనం వాటిని పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు ధిక్కారం కింద తీసుకోవాల్సి ఉంటుందని జస్టిస్ గవాయ్ అన్నారు. ''మేం సంయమనం పాటిస్తున్నాం.. మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలి''అని వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూశారని సింఘ్వీ పేర్కొనగా.. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడి వరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అన్నారు.

# ట్రంప్ సుంకాలు.. ఏం చేయాలనుకుంటున్నారు..?

**అమెరికా సుంకాల అంశాన్ని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ లేవనెత్తారు.**

**ఈ-కబురు:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ దిగుమతులపై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్ లపై కేంద్ర ప్రభుత్వం స్పందన తెలియజేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభలో మాట్లాడిన రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధించిన సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయన్నారు. దీనిపై కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా భారత్‌చైనా వివాదాన్ని ఆయన ప్రస్తావిస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 'చైనా భారత్‌కు చెందిన 4 వేల కి.మీ. పైగా భూభాగాన్ని ఆక్రమించింది. దీనిపై ప్రధాని మోదీ , రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బీజింగ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది. అక్కడి రాయబారి ద్వారా ఈ విషయం బయటపడింది. దాన్ని తిరిగి తీసుకోవాలి' అని రాహుల్ పేర్కొన్నారు.ఇక, రాహుల్ వ్యాఖ్యలకు భాజపా ఎంపీ అనురాగ్ ఠాకూర్ గట్టిగా బదులిచ్చారు. ఎవరి హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసన్నారు. డోక్లాపై ప్రతిష్ఠంభన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి సూప్ ఎవరు తాగారో తెలుసని రాహుల్‌పై విమర్శలు చేశారు. ఇలాంటి అంశంపై రాజకీయాలు చేయడం వల్ల ఏ ఫలితం ఉండదన్నారు. గతంలో జరిగిన తప్పిదాలకు వారే (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) సమాధానం చెప్పాలన్నారు.



అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే.. తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ క్రమంలో భారత్ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే.. ట్రంప్ సుంకాల బాంబు వేశారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52% సుంకం విధిస్తున్నందున, తాము 27% సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు.



# కేసీఆర్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట

**తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది.**

**ఈ-కబురు,హైదరాబాద్:** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. 2011లో నమోదైన రైల్‌రోకో కేసును ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో 2011 ఆగస్టు 15న సికింద్రాబాద్‌లో రైల్‌రోకో నిర్వహించారు. ఈ క్రమంలో పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు చెప్పిన వాంగ్మూలం ఆధారంగా కేసీఆర్‌ను 13వ నిందితుడిగా రైల్వే పోలీసులు చేర్చారు. ఈ మేరకు ప్రజాప్రతినిధుల కోర్టులో పోలీసులు అభియోగపత్రం దాఖలు చేశారు.

ఈ కేసు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో.. కేసును కొట్టివేయాలంటూ కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. రైల్‌రోకో జరిగిన సమయంలో కేసీఆర్ సంఘటన స్థలంలో లేరని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. కేసీఆర్ పిలుపుతోనే రైల్‌రోకో నిర్వహించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం.. కేసీఆర్‌పై నమోదైన కేసును కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.



## తారాస్థాయికి చేరిన గోల్డ్ రేటు

# ఇదే ఆల్‌టైమ్ రికార్డ్!

**దేశంలో తొమ్మిదో రోజు బంగారం ధరలు దూసుకెల్తూనే ఉన్నాయి. ఈ రోజు (ఏప్రిల్ 3) కూడా గోల్డ్ రేటు గరిష్టంగా రూ.540 పెరిగింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా పసిడి ధరలలో మార్పులు జరిగాయి. ఈ కథనంలో ఏ ప్రాంతంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయనే వివరాలను తెలుసుకుందాం**

హైదరాబాద్, విజయవాడలలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 85,600 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 93,380 వద్ద నిలిచాయి. నిన్న స్థిరంగా ఉన్న పసిడి ధర.. ఈ రోజు రూ. 500 (22 క్యారెట్స్ 10గ్రా), రూ. 540 (24 క్యారెట్స్ 10గ్రా) పెరిగింది. ఇదే ధరలు గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో కూడా కొనసాగుతాయి.

చెన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ. 500, రూ. 540 పెరిగింది. దీంతో ఇక్కడ 10గ్రా 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 85,600 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 93,380 వద్ద ఉంది.

దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు రూ. 85,750 (10గ్రా 22 క్యారెట్స్), రూ. 93,530 (10గ్రా 24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 500, రూ. 540 ఎక్కువ. అంతే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఢిల్లీలో గోల్డ్ రేటు కొంత ఎక్కువగానే ఉంది.

వెండి ధరలు

బంగారం ధరలు పెరిగినప్పటికీ.. వెండి ధరలు మాత్రం తగ్గుముఖం పట్టాయి. ఈ రోజు (ఏప్రిల్ 3) కేజీ సిల్వర్ రేటు రూ. 1,13,900 చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకే విధంగా ఉన్నప్పటికీ.. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి రేటు రూ. 1,04,900 వద్ద ఉంది.

# ఆకాశవీధిలో..

- పెరుగుతున్న విమానయాన జోష్
- 2027 నాటికి 49 కోట్లకు ప్రయాణికులు
- ఏటా 9 శాతం వృద్ధి సాధ్యం
- రేటింగ్ ఏజెన్సీ కేర్‌ఎడ్జ్ అంచనాలు



**ముంబై:** పౌర విమానయానం వృద్ధి వేగాన్ని అందుకుంది. విమాన ప్రయాణికుల సంఖ్య 2024 మార్చి నుంచి ఏటా 9 శాతం చొప్పున పెరుగుతూ.. 2027 మార్చి నాటికి వార్షికంగా 48.5 కోట్లకు చేరుకుంటుందని రేటింగ్ ఏజెన్సీ 'కేర్ ఎడ్జ్' ఒక నివేదిక రూపంలో వెల్లడించింది. 2025-26 నుంచి మరింత పెద్ద విమానాలు అందుబాటులోకి వస్తుండడంతో అంతర్జాతీయ విమాన ప్రయాణికుల రద్దీ మరింత వేగాన్ని అందుకుంటుందని పేర్కొంది. అదే సమయంలో దేశీ విమాన ప్రయాణికుల్లో స్థిరమైన వృద్ధి కనిపిస్తుందని తెలిపింది.

కరోనా అనంతరం విమానయాన రంగం 'వి' ఆకారపు రికవరీని (పడిపోయినట్టుగానే పెరగడం) చూసిందని.. కరోనా ముందు నాటి ప్రయాణికులతో పోల్చితే 1.10 రెట్లకు రద్దీ చేరుకున్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. విమాన ప్రయాణికుల రద్దీ 2025 మార్చి నాటికి 42.5 కోట్లకు చేరుకుంటుందని లోగడ వేసిన అంచనాలను కేర్‌ఎడ్జ్ సవరించింది. విమానాల డెలివరీలో జాప్యం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో 4 శాతం వృద్ధితో 41 కోట్లకు చేరుతుందని పేర్కొంది. మహాకుంభ మేళా సమయంలో (2024-25 జనవరి-మార్చి) విమానయాన ప్రయాణికుల రద్దీ గణనీయంగా పెరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలంలో తక్కువ వృద్ధిని భర్తీ చేస్తుందని తెలిపింది.

**ఏరో, నాన్ ఏరో ఆదాయాల్లో వృద్ధి..**

11 విమానాశ్రయాల ఏరో ఆదాయం (విమాన సర్వీసులు, వాటి అనుబంధ సేవలు) 2024 మార్చి నుంచి 2027 మార్చి మధ్య ఏటా 42 శాతం వృద్ధి చెందుతుందని కేర్‌ఎడ్జ్ నివేదిక అంచనా వేసింది. ఇదే కాలంలో నాన్‌ఏరో ఆదాయం ఏటా 12-14 శాతం చొప్పున పెరుగుతుందని పేర్కొంది. డ్యూటీ ఫ్రీ షాపులు, ఫుడ్, బెవరేజెస్ విక్రయాలు, లాంజ్ సేవల రూపంలో ఈ ఆదాయం ఉంటుందని వివరించింది. భారత ఎయిర్‌పోర్టుల్లో ఒక్కో ప్రయాణికుడి నుంచి వచ్చే నాన్ ఏరో ఆదాయం కంటే.. అంతర్జాతీయంగా విమానాశ్రయాలకు రెట్టింపు ఆదాయం వస్తున్నట్టు తెలిపింది. ఈ ప్రకారం చూస్తే భారత విమానాశ్రయాలకు నాన్ ఏరో ఆదాయం వృద్ధికి చక్కని అవకాశాలున్నట్టు పేర్కొంది. కొన్ని ఎయిర్‌పోర్ట్‌ల్లో చార్జీల పెంపు, ప్రయాణికుల సంఖ్య పెరుగుదల రూపంలో ఈ ఆదాయం 2024-25 నుంచి వృద్ధి వేగాన్ని అందుకుంటుందని వెల్లడించింది.

**విస్తరణపై భారీ పెట్టుబడులు**

**"ప్రయాణికుల రద్దీ ఏటా 9 శాతం వృద్ధికి.. విమాన ప్రయాణానికి బలమైన డిమాండ్‌కుతోడు విమానాశ్రయాలు, ఎయిర్‌లైన్స్ సంస్థలు సామర్థ్యాల విస్తరణ మద్దతుగా నిలవనుంది" అని కేర్‌ఎడ్జ్ డైరెక్టర్ మౌలేష్ దేశాయ్ వివరించారు. దేశీ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్లు, ఎయిర్‌పోర్ట్ అధారిటీ ఆఫ్ ఇండియా కలసి 2020 మార్చి తర్వాత నుంచి 2024 డిసెంబర్ మధ్య రూ.80,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడాన్ని కేర్‌ఎడ్జ్ తన నివేదికలో ప్రస్తావించింది. ఇందులో 42 శాతం పెట్టుబడులను నాలుగు ప్రాంతాల్లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్‌ట్‌ల కోసం (కొత్తవి) వెచ్చించినట్టు తెలిపింది.**

**2025–26 నుంచి 2029–30 మధ్యకాలంలో ఈ రంగంలో మరో రూ.30,000 కోట్ల పెట్టుబడులను కేర్‌ఎడ్జ్ అంచనా వేసింది. ప్రధానంగా బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్‌ట్‌ల (ప్రస్తుత ఎయిర్‌పోర్టులు) విస్తరణపై ఈ పెట్టుబడులను వెచ్చించొచ్చని అంచనా వేసింది. రూ.25,000 కోట్లతో నిర్మించే రెండు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్‌ట్‌లు 2025–26లో కార్యకలాపాలు ప్రారంభించొచ్చని తెలిపింది. పెట్టుబడుల్లో 18 శాతాన్ని నాన్‌ఏరోనాటికల్ అభివృద్ధిపై (ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో వాణిజ్య రియల్ ఎస్టేట్) వెచ్చించొచ్చని అంచనా వేసింది. ఈ విషయంలో సింగపూర్ ఛాంగి విమానాశ్రయాన్ని ఉదహరణగా పేర్కొంది. నాన్ ఏరోనాటికల్ సదుపాయాలపై చేస్తున్న పెట్టుబడుల నుంచి వచ్చే ప్రతిఫలం వాటి రుణ పరపతిని నిర్ణయిస్తుందని తెలిపింది.**







## పీపీఎఫ్ నామినీ మార్పునకు ఛార్జీలు లేవు: నిర్మలా సీతారామన్

**నామినీ వివరాలను అప్డేట్ చేసినప్పుడు లేదా మార్చినప్పుడు 'పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్' చందాదారులు ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ఆర్థిక మంత్రి 'నిర్మలా సీతారామన్' తెలిపారు. ఈ విషయాన్ని తన అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించారు.**

పీపీఎఫ్ ఖాతాలకు నామినీ పేర్లను మార్చడానికి ఆర్థిక సంస్థలు రూ.50 వసూలు చేసినట్లు మా దృష్టికి వచ్చింది. ఈ చార్జీలను తొలగించడానికే జీవో తీసుకురావడం జరిగింది. దీనికోసం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అవసరమైన మార్పులు చేసినట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

ఇటీవల ఆమోదం పొందిన బ్యాంకింగ్ సవరణ బిల్లు 2025 ప్రకారం.. డిపాజిటర్ల డబ్బు, సురక్షిత కస్టడీలో ఉంచిన వస్తువులు, భద్రతా లాకర్ల చెల్లింపు కోసం నలుగురు వరకు నామినీలు ఉండవచ్చు.

నామినేషన్ కోసం ఫారం 10 ని దాఖలు చేయడం ద్వారా మీరు మీ పీపీఎఫ్ ఖాతాలోని నామినీ వివరాలను మార్చవచ్చు. దీన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలోనూ అప్డేట్ చేసుకోవచ్చు. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి కొన్ని బ్యాంకులు ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చందాదారులు వివరాలను నవీకరించడానికి అనుమతిస్తాయి

## సూపర్ ఫాస్ట్ 5G..

# జియో కొత్త సేవలు

**రిలయన్స్ జియో 26 గిగాహెర్ట్జ్ మిల్లీమీటర్ వేవ్ (ఎంఎంవేవ్) బ్యాండ్‌లో హై-ఫ్రీక్వెన్సీ 5జీ సేవలను ప్రారంభించింది. 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రారంభమైన ఈ సేవలు ఇప్పటికే దేశంలోని అన్ని టెలికాం సర్కిళ్లలో అందుబాటులో ఉన్న మిడ్-బ్యాండ్ 3.3 గిగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌లో జియో ప్రస్తుత 5జీ కవరేజీని ఎంఎంవేవ్ రోల్‌అవుట్ భర్తీ చేస్తుంది.**





ప్రస్తుత మిడ్‌బ్యాండ్ 5జీ బలమైన పనితీరు, విస్తృత కవరేజీని అందిస్తూ వినియోగదారుల అవసరాలను చాలా వరకూ తీరుస్తుండగా, ఎంఎంవేవ్ బ్యాండ్ లేదా 26 గిగాహెర్ట్జ్ స్పెక్ట్రమ్‌ను ప్రత్యేక ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్లు అంటే వాణిజ్య అవసరాల కోసం తీసుకొచ్చినట్లుగా తెలుస్తోంది.

**ఏమిటీ ఎంఎంవేవ్ 5జీ?**

మిల్లీమీటర్ వేవ్ 5 జి సాంప్రదాయ మొబైల్ నెట్‌వర్క్‌ల కంటే చాలా ఎక్కువ ఫ్రీక్వెన్సీలలో పనిచేస్తుంది. ఇది అల్ట్రాఫాస్ట్ డేటా ట్రాన్స్‌మిషన్, చాలా తక్కువ లేటెన్సీని అనుమతిస్తుంది. అయితే దీని పరిధి పరిమితంగా ఉంటుంది. ఇది భవనాల లోకి చొచ్చుకువెళ్లలేదు. అలాగే విస్తృత ప్రాంతాలను కవర్ చేయలేదు. అందుకే ఎంఎంవేవ్ 5జీకి మరింత దట్టమైన మౌలిక సదుపాయాలు, బేస్ స్టేషన్లు, చిన్న సెల్స్, కచ్చితమైన ప్లేస్‌మెంట్ అవసరమవుతాయి. దీని వల్ల ఖరీదు కూడా ఎక్కువే.

దేశవ్యాప్త వినియోగదారుల రోల్‌అవుట్ల కంటే నిర్దేశిత ప్రదేశాలల్లో ఏర్పాటుకే ఇవి అనుకూలంగా ఉంటుంది. సరళంగా చెప్పాలంటే, రెగ్యులర్ మొబైల్ బ్రౌజింగ్ లేదా వీడియో స్ట్రీమింగ్ చేసేవారికి ఎంఎంవేవ్ నుండి పెద్దగా ప్రయోజనం ఉండదు. అయితే స్మార్ట్ ఫ్యాక్టరీలు, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, హైఫ్రీక్వెన్సీ ట్రేడింగ్, రిమోట్ సర్జరీలు వంటి ఎంటర్‌ప్రైజ్ సంబంధిత వినియోగానికి మాత్రం అత్యధిక వేగం, తక్కువ జాప్యంతో ఇది సేవలందిస్తుంది.

**ఎంఎంవేవ్ 5జీ లాంచ్ ఎక్కడెక్కడంటే..**

జియో ఎంఎంవేవ్ 5జీ ఇప్పుడు దేశంలోని 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో అందుబాటులో ఉంది. వీటిలో ఉత్తర భారతదేశంలో ఢిల్లీ, పంజాబ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఉత్తర ప్రదేశ్, బిహార్ ఉన్నాయి. పశ్చిమ భారత దేశంలో రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, దక్షిణ భారతదేశంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జియో ఎంఎంవేవ్ 5జీ అందుబాటులోకి వచ్చింది. ఇక తూర్పు, ఈశాన్య భారతదేశం విషయానికి వస్తే పశ్చిమ బెంగాల్, ఒడిశా, అస్సాం, త్రిపుర, నాగాలాండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి.



## ఇక రిలయన్స్ గేమ్స్.. బ్లాస్ట్ ఈస్పోర్‌ట్‌స్‌తో జేవీ

**న్యూఢిల్లీ:** దేశీయంగా ఈస్పోర్ట్స్ బిజినెస్ నిర్వహించేందుకు డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ భాగస్వామ్య కంపెనీ (జేవీ)ని ఏర్పాటు చేయనుంది. సొంత అనుబంధ సంస్థ రైజ్ వరల్‌డ్‌వైడ్ ద్వారా బ్లాస్ట్ ఈస్పోర్‌ట్‌స్‌తో ఇందుకు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. తద్వారా జేవీకి తెరతీయనుంది.

రిలయన్స్, బ్లాస్ట్ జత కట్టడం (జేవీ) ద్వారా దేశీయంగా అత్యున్నత ఐపీలను అభివృద్ధి చేయనున్నట్లు సంయుక్త ప్రకటనలో రెండు సంస్థలు పేర్కొన్నాయి. అంతేకాకుండా అభిమానులు, క్రీడాకారులు, బ్రాండ్ల కోసం బ్లాస్ట్‌కున్న గ్లోబల్ ఐపీలను సైతం దేశీయంగా ప్రవేశపెట్టనున్నట్లు తెలియజేశాయి.

బ్లాస్ట్ ఏపీఎస్ (డెన్మార్క్) ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద టోర్నమెంట్ నిర్వాహక సంస్థలలో ఒకటికాగా.. గేమ్ పబ్లిషింగ్ గ్లోబల్ దిగ్గజాలు ఎపిక్ గేమ్స్, వాల్వ్, రియట్ గేమ్స్, క్రాఫ్టన్, యూబిసాఫ్ట్ తదితరాలతో కలసి పనిచేస్తోంది. తద్వారా గ్లోబల్ ఈస్పోర్ట్స్ ప్రాపర్టీలను ఆవిష్కరిస్తోంది.





## మారుతి సుజుకి కొత్త ధరలు ఇవే..

**ప్రముఖ వాహన తయారీ సంస్థ 'మారుతి సుజుకి' చెప్పినట్లుగానే తన వాహన ధరలను పెంచింది. పెరిగిన ధరలు ఏప్రిల్ 8 నుంచి అమలులోకి రానున్నట్లు తెలుస్తోంది. పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులు, ఇతర మెయింటెనెన్స్ ఖర్చుల కారణంగానే ధరలను పెంచడం జరిగిందని కంపెనీ స్పష్టం చేసింది.**

మారుతి సుజుకికి తన గ్రాండ్ విటారా అన్ని వేరియంట్ల ధరలను గరిష్టంగా రూ. 62,000 వరకు పెంచింది. ఈకో రూ. 22500, వ్యాగన్‌ఆర్ రూ. 14000, ఎర్టిగా రూ. 12500, ఫ్రాంక్స్ రూ. 2500, డిజైర్ రూ. 3000 పెంపును పొందాయి. ఏప్రిల్ 8 తరువాత ఈ కార్లు కొత్త ధరల వద్ద అందుబాటులో ఉంటాయి.

202425 ఆర్థిక సంవత్సరంలో మారుతి సుజుకి సేల్స్

2024-2025 ఆర్థిక సంవత్సరంలో మారుతి సుజుకి ఇండియా మొత్తం అమ్మకాలు 2,234,266 యూనిట్లుగా నమోదయ్యాయి. 202324 ఆర్థిక సంవత్సరంలో జరిగిన మొత్తం అమ్మకాల (2,135,323 యూనిట్లు) కంటే 4.63 శాతం ఎక్కువ. ఈ ఏడాది మొత్తం దేశీయ అమ్మకాలు 17,60,767 యూనిట్లు కాగా.. మిగిలినవి ఎగుమతులు.

# భారత్‌లోకి యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్లు

**యాపిల్ అధికారికంగా భారతదేశంలోని వినియోగదారులకు 'యాపిల్ ఇంటెలిజెన్స్ ఫీచర్ల'ను విడుదల చేసింది. ఐఓఎస్ 18.4, ఐప్యాడ్‌ఓఎస్ 18.4, మ్యాక్‌ఓఎస్ సెకోయా 15.4 అప్‌డేట్‌ల్లో ఈ ఫీచర్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. వీటిని సర్వీసులను మెరుగు పరిచేందుకు జనరేటివ్ ఏఐను వినియోగించినట్లు టెక్ నిపుణులు చెబుతున్నారు.**

యాపిల్ వరల్‌ట్‌వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్ (డబ్ల్యూడబ్ల్యూడీసీ) 2024లో మొదట ఆవిష్కరించిన యాపిల్ ఇంటెలిజెన్స్ క్రమంగా యూఎస్, యూకే, యూరప్, కెనడాలో విస్తరించింది. కొన్ని కారణాల వల్ల ఈ అప్‌డేట్‌ను ఇండియాలో ఇప్పటివరకు విడుదల చేయలేదు. ఇటీవల యాపిల్ ఇంటెలిజెన్స్‌ను భారత్‌లోనూ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ పేర్కొంది. ఐఫోన్ 15 ప్రో, ఐఫోన్ 15 ప్రో మ్యాక్స్, ఐఫోన్ 16 సిరీస్ ఫోన్లలో ఓఎస్‌ను అప్‌డేట్ చేసుకొని ఈ ఫీచర్లను ఉపయోగించవచ్చని తెలిపింది.





**ఇండియాలో అందుబాటులో ఉన్న ఫీచర్లు**

**రైటింగ్ టూల్స్**

ఈమెయిల్, సందేశాలు, గమనికలు, థర్డ్‌పార్టీ అప్లికేషన్లలో టెక్ట్స్‌ను సులువుగా టైప్ చేయడానికి, అందులోని వివరాలను ప్రూఫ్ రీడ్ చేయడానికి వీలు కల్పించారు. ప్రొఫెషనల్ ఈమెయిల్‌ను రూపొందించడం, సాధారణ సందేశాన్ని సిద్ధం చేయడం, వినియోగదారులకు అనుగుణంగా వాటిని సర్దుబాటు చేయడం, వ్యాకరణం, పదాల ఎంపిక, వాక్య నిర్మాణాన్ని మెరుగుపరచడానికి సూచనలు వంటి చాలా అంశాలను ఈ రైటింగ్ టూల్స్‌లో పొందుపరిచారు.

**మెరుగైన ఫొటోలు**

ఫొటోస్ యాప్‌లో ఏఐను నిక్షిప్తం చేశారు. ఇందులోకి క్లీన్ అప్ టూల్ వినియోగదారులకు ఒరిజినల్ సన్నివేశం పాడవకుండా ఫొటోలోని అనవసర వస్తువులు లేదా వ్యక్తులను తొలగించడానికి అనుమతిస్తుంది. యాపిల్ ఇంటెలిజెన్స్ ఫొటోలు, వీడియోలను విశ్లేషిస్తుంది. స్టోరీలను క్రియేట్ చేస్తుంది. జెన్‌మోజీ ద్వారా కావాల్సిన విధంగా ఫొటోల ఎమోజీలను సృష్టించవచ్చు. మరోవైపు ఇమేజ్ బ్యాక్‌గ్రౌండ్, థీమ్స్, కాస్ట్యూమ్స్ లేదా యాక్సెసరీల ఆధారంగా ప్రత్యేకమైన చిత్రాలను సృష్టించడానికి వినియోగదారులకు వీలు కల్పిస్తుంది.

**సిరి మరింత తెలివిగా..**

సిరి యాపిల్ ఇంటెలిజెన్స్‌తో మమేకమై యూజర్ల ప్రశ్నలకు ప్రతిస్పందిస్తుంది. జనరేటివ్ ఏఐ సాయంతో ఈమేరకు సమాధానాలు చెబుతుంది. సిరితో వాయిస్ లేదా టెక్ట్స్ ద్వారా సంభాషించవచ్చు. మెరుగైన భాషా అవగాహన కలిగిన సిరి ఏఐ వినియోగదారులు ప్రశ్నలు అడగడంలో తడబడినప్పటికీ సరైన విధంగా సమాధానం అందించేలా రూపొందించారు.

విజువల్ ఇంటెలిజెన్స్

ఐఫోన్ 16 సిరీస్, ఐఫోన్ 15 ప్రో మోడళ్లకు ప్రత్యేకంగా ఉన్న ఈ ఫీచర్‌తో తక్షణ సమాచారాన్ని పొందేందుకు వీలవుతుంది. ఉదాహరణకు ఒక పువ్వును ఫొటో తీసేందుకు కెమెరా ముందుంచితే అది పెరుగుతున్న పరిస్థితులు, సంరక్షణ చిట్కాలను వెల్లడిస్తుంది.

**చాట్‌జీపీటీ ఇంటిగ్రేషన్**

చాట్ జీపీటీని సిరి, రైటింగ్ టూల్స్‌లో ఇంటిగ్రేట్ చేయడానికి యాపిల్ ఓపెన్ ఏఐతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. అధునాతన ఏఐ సామర్థ్యాలతో డాక్యుమెంట్లను విశ్లేషించడం లేదా ఫొటోలకు సంబంధించి ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం వంటి సంక్లిష్ట ప్రశ్నల కోసం సిరి చాట్ జీపీటీని ట్యాప్ చేయవచ్చు.



# అలాంటి జోకర్లందరూ జాగ్రత్తగా ఉండండి.. 'నాని' టీమ్ పోస్ట్

టాలీవుడ్ హీరో నాని, శ్రీకాంత్ ఓదెలా కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ సినిమా 'ది ప్యారడైజ్'.. పోస్టర్‌తో పాన్ ఇండియా రేంజ్‌లో సినీ ప్రేక్షకులను మెప్పించిన ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా షూటింగ్ ప్రారంభం కాకుండానే ఓటీటీ డీల్ భారీ ధరకు అమ్ముడుపోయినట్లు వార్తలు వచ్చాయి. కేవలం గ్లింప్స్‌తోనే సంచలనం క్రియేట్ చేసిన ఈ సినిమా ఆగిపోయిందంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరిగింది. ఈ మూవీ స్క్రిప్ట్ విషయంలో నాని అసంతృప్తితో ఉన్నారని, కొన్ని మార్పులు చేయాలని కోరినట్లు వైరల్ అయింది. ఆపై బడ్జెట్ కూడా భారీగానే పెరిగిపోవడం వల్ల ఈ సినిమాను ఆపేస్తున్నారని కథనాలు వచ్చాయి. అయితే, ఈ అంశంపై చిత్ర యూనిట్ గట్టిగానే రియాక్ట్ అయింది.

సోషల్ మీడియాలో ఇలాంటి తప్పుడు రూమర్స్ వైరల్ చేసేవారిని జోకర్స్‌తో పోలుస్తూ ఇలా చెప్పుకొచ్చారు. 'ది ప్యారడైజ్ ప్రాజెక్ట్‌పై ఎలాంటి అనుమానాలు వద్దు. మేము అనుకున్నట్లుగానే పనులు జరుగుతున్నాయి. ఎవరూ కంగారుపడాల్సిన పనిలేదు. ఈ చిత్రాన్ని చాలా గొప్పగా తెరకెక్కిస్తున్నాం. దానిని మీరందరూ కూడా త్వరలో చూస్తారు. ఆ సమయం వరకు రూమర్స్‌తో కొందరు బతికేయవచ్చు. 'గజరాజు నడుస్తూ ఉంటే..గజ్జి కుక్కలు అరుస్తాయి'. ది ప్యారడైజ్ సినిమాపై అభిమానులు చూపించే ప్రేమను మేము చాలా దగ్గరగా చూస్తునే ఉన్నాం.

ఆపై ఈ మూవీపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిని కూడా గమనిస్తున్నాం. మేము ప్రేమ, ద్వేశాన్ని రెండూ తీసుకుంటాము. వాటన్నిటితో ఒక శక్తిగా మీ ముందుకు తిరిగొస్తాం. తెలుగు పరిశ్రమలో ఉండే గొప్ప చిత్రాలలో ఒకటిగా ఈ మూవీ ఉంటుంది. సినిమాపై రూమర్స్ క్రియేట్ చేస్తున్న వారందరూ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాము.. ఫ్యాన్స్ అందరూ మెచ్చేలా ప్యారడైజ్ సినిమాతో నాని తిరిగొస్తాడని మాట ఇస్తున్నాం.' అని ఒక చిత్ర యూనిట్ ఒక పోస్ట్ చేసింది.

హిట్ 3 టీజర్‌లో మోస్ట్ వయోలెంట్ ఆఫీసర్‌గా కనిపించిన నాని దానికి మించిన రేంజ్‌లో ది ప్యారడైజ్‌లో కనిపంచి అందరినీ ఆశ్చర్యపరిచాడు. వచ్చే సంవత్సరం మార్చి 26న ఈ మూవీని థియేటర్లలో రిలీజ్ చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. ఇంగ్లీష్, స్పానిష్‌సహా 8 భాషలలో ది ప్యారడైజ్ విడుదల కానుంది.

# హైకోర్టును ఆశ్రయించిన హీరోయిన్ హన్సిక.. ఎందుకంటే?

హీరోయిన్ హన్సిక మోత్వానీ తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టి వేయాలంటూ బాంబే హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఆమె సోదరుడి భార్య, నటి ముస్కాన్ నాన్సీ జేమ్స్‌కు నోటీసులు జారీ చేసింది. మార్చి 24న హన్సిక పిటిషన్ వేయగా.. ఇవాళ ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. తదుపరి విచారణను జులై 3కు వాయిదా వేసింది. కాగా.. ఇప్పటికే ఈ కేసులో హన్సిక మోత్వానీకి ముంబై సెషన్స్ కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే.

కాగా.. గతంలో హన్సికతో పాటు ఆమె తల్లిపై సోదరుడి భార్య ముస్కాన్ నాన్సీ జేమ్స్ గృహ హింస కేసు పెట్టారు. 2020లో హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వానీ.. బుల్లితెర నటి ముస్కాన్ నాన్సీ జేమ్స్‌ను వివాహం చేసుకున్నాడు. ఆ తర్వాత విభేదాలు రావడంతో 2022లోనే విడిపోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ సమయంలోనే తనను వేధింపులకు గురి చేశారంటూ హన్సికతో పాటు సోదరుడు ప్రశాంత్, ఆమె తల్లిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలోనే తమపై నమోదైన కేసును కొట్టి వేయాలంటూ హన్సిక బాంబే హైకోర్ట్‌ను ఆశ్రయించింది.



# అదిరిపోయే ఫన్‌తో 'జాక్'.. ట్రైలర్ రిలీజ్



టాలీవుడ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ కొత్త సినిమా 'జాక్' ట్రైలర్ వచ్చేసింది. ఇందులో వైష్ణవి చైతన్య జంటగా నటిస్తుంది. తాజాగా విడుదలైన ట్రైలర్ చూస్తుంటే ప్రేక్షకులకు డబుల్ ధమాకానే అనిపించేలా ఉంది. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదల కానుంది. ప్రకాశ్ రాజ్ వాయిస్‌తో ప్రారంభమైన 'జాక్' ట్రైలర్‌ను చూస్తే పూర్తి వినోదాత్మక చిత్రంలా ఉంది. ఇందులో వైష్ణవి చైతన్య తొలిసారి ద్విపాత్రాభినయం చేస్తుండటం విశేషం.

# ఇంటిమేట్ సీన్‌లో అతడు హద్దుమీరాడు.. ఇదే ఛాన్స్ అనుకుని ఆ పై.. పోటుగాటు హీరోయిన్

బాలీవుడ్ నటి అనుప్రియా గోయెంకా ఒక ముద్దు సీన్‌లో చాలా ఇబ్బంది పడ్డానని ఆమె ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. తెలుగులో పోటుగాడు, పాఠశాల సినిమాలతో తెలుగు సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ టైగర్ 3, పద్మావత్ వంటి సినిమాలతో పాటు పాంచాలి, అసుర్, ఆశ్రమ్ వంటి వెబ్ సిరీస్‌లతో ఆమె మెప్పించింది. కథకు అవసరం అనుకుంటే ఇంటిమేట్ సీన్లలో నటించేందుకు ఆమె ఏమాత్రం తగ్గదు. అయితే, ఓ సినిమాలో ఇంటిమేట్ సీన్ చిత్రీకరిస్తున్నప్పుడు ఒక నటుడు తనతో కావాలనే అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆమె పేర్కొన్నారు. ఆ నటుడి వివరాలను గోప్యంగానే ఉంచిన ఆమె ఇలా చెప్పుకొచ్చింది.

ఒక సినిమాకు సంబంధించి ముద్దు సీన్‌ను షూటింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ సీన్‌లో నా దుస్తులు అసౌకర్యంగానే ఉంటాయి. కిస్సింగ్ సీన్ చిత్రీకరిస్తున్నప్పుడు అతను తేలికగా నా నడుము పట్టుకోవచ్చు.. స్క్రిప్ట్‌లో కూడా అదే ఉంది. కానీ, ఆ సమయంలో అతను అసభ్యకరంగా మరోచోట చెయి వేశాడు. దీంతో చాలా బాధపడ్డాను. అలా ఎందుకు చేస్తున్నావ్ అని అతన్ని ప్రశ్నించవచ్చు.. కానీ, అడగలేదు. ఎందుకంటే పొరపాటు అయిందని సింపుల్‌గా చెప్పి వెళ్లిపోతాడని తెలుసు. అందుకే అడగలేదు. తర్వాతి టేక్‌లో ఇలా చేయకండి అంటూ అతనికి చెప్పాను. ఆ సీన్ తీస్తున్నప్పుడు అతను చాలా ఉద్వేగానికి లోనయ్యాడు. నేనే కంట్రోల్ చేశాను. నాకు రెండుసార్లు ఇలా జరిగింది.' అని అనుప్రియా గోయెంకా చెప్పింది. 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ' టెలివిజన్ సిరీస్ గురించి ఆమె మట్లాడినట్లు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.







## ఆట పైనే మా దృష్టి.. శబ్దం మీద కాదు

# కోహ్లీకి గిల్ కౌంటర్!

**శుభ్‌మన్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. అదీనూ స్టార్ బ్యాటర్‌ను ఉద్దేశించినట్లుగా పోస్టు పెట్టడం గమనార్హం.**

బెంగళూరును తన సొంత మైదానంలో మట్టికరిపించిన గుజరాత్ పాయింట్ల పట్టికలో టాప్4లోకి దూసుకొచ్చింది. ఈసందర్భంగా గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. భారత స్టార్ ఆటగాడు, ఆర్సీబీ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ కి కౌంటర్‌గా అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అసలు ఇంతకీ ఏం పోస్టు పెట్టాడంటే?

చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆర్సీబీపై గుజరాత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఐపీఎల్ 2025 సీజన్‌ను ఘనంగా ప్రారంభించిన బెంగళూరుకు సొంత మైదానంలోనే షాక్ తగిలింది. ఇక్కడ ఆడే ప్రతి మ్యాచ్ సమయంలోనూ విరాట్ కోహ్లీ అభిమానులను ఉత్సాహపరుస్తూ ఉంటాడు. అదే సమయంలో గిల్ వికెట్ పడినప్పుడూ ఆ స్థాయిలోనే సంబరాలు చేసుకున్నాడు. ఆ మ్యాచ్‌లో గుజరాత్ గెలిచాక.. గిల్ సోషల్ మీడియాలో '' మేం గేమ్‌పై దృష్టిపెడతాం. శబ్దం మీద కాదు'' అని పోస్టు పెట్టాడు. దీనికి అభిమానులు ప్రతిస్పందించారు.

**"మ్యాచ్ సమయంలో విరాట్ కోహ్లీ చేసిన దానికి శుభ్‌మన్ గిల్ కౌంటర్ ఇచ్చాడు"**

''మాకు తెలుసు. ఎవరి గురించి గిల్ పోస్టు పెట్టాడో అర్థమైంది. అయితే, ఇక్కడ నిన్ను (గిల్) తక్కువ చేసే ఉద్దేశం లేదు కానీ, దేశంలో అత్యంత ఓవర్‌రేటెడ్ ప్లేయర్‌వి నువ్వే''

''ఇలాంటి కామెంట్లు చేయడం వల్ల వచ్చిన లాభం ఏంటి? ఎవరైనా నిన్ను హేళన చేశారా? ఏ మ్యాచ్‌లోనైనా సొంత జట్టుకే ఫ్యాన్స్ మద్దతుగా నిలుస్తారు. నిన్ను ఓ బ్యాటర్‌గా అభిమానిస్తా. ఇప్పుడు నీపై ఉన్న గౌరవం పోయింది''

''ఫస్ట్ భారత్ తరఫున టీ20 జట్టులో స్థానం సంపాదించు. ఆ తర్వాత ఇలాంటివి పోస్టు చేయొచ్చు''



## నాన్నేమో కుటుంబానికి దూరం..
## అమ్మ కష్టంతో 'పసిడి పతకాల పంట'

**అంతర్జాతీయ కరాటే పోటీల్లో గ్రామీణ విద్యార్థిని ప్రతిభ**
**మలేషియా ఇంటర్నేషనల్ పోటీలకు హాసిని ఎంపిక**
**వరల్డ్ చాంపియన్‌షిప్‌లో దేశానికి మెడల్ తేవడమే లక్ష్యం**

**ముత్తారం(మంథని):** ఆమె గ్రామీణ విద్యార్థిని.. ఆర్థిక స మస్యలున్నా కరాటే పోటీల్లో పంచ్ కొడితే పతకం సాధించాలనే తపనతో ప్రతిభకు ప దును పెడుతోంది. ఇటీవల జ రిగిన జాతీయ స్థాయి పోటీల్లో ప్ర తిభ చూపి మే నెలలో మలేషియాలో దేశంలో జరిగే ఇంటర్నేషనల్ కరాటే పోటీలకు ఎంపికైంది మెట్టు హాసిని.

**పోటీ పడితే పతకమే..**

మంథనికి చెందిన మెట్టు దేవి - నర్సింగం దంపతులకు ఇద్దరు కూతుర్లు. పెద్ద కుతూరు మానసకు వివాహం అయ్యింది. చిన్నకుతూరు హాసిని మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు మంథని బాలికల హై స్కూల్‌లో చదివింది. ముత్తారం మండలం ధర్యపూర్ మోడల్ స్కూల్‌లో ఇంటటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రా సింది.

నాలుగో తరగతిలోనే సీనియర్ల ను చూసి కరాటే నే ర్చుకోవడమే కాదు.. అందులో రాణించాలని కంకణం కట్టుకుంది. ఇలా ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుతూనే కరాటేలో శిక్షణ తీసుకుంది.

**పసిడి పతకాల పంట**

అదేసమయంలో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించింది. పోటీపడితే వెండి పతకాలతో పాటు ఇప్పటివరకు 15 బంగారు పతకాలు సాధించింది. 2024లో హరియాణాలోని పంచకుల, మధ్యప్రదేశ్‌లోని గాలియానాలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో బ్లాక్‌బెల్ట్‌లో గోల్డ్‌మెడల్ సాధించి ఔరా అనిపించింది.

గతేడాది 2024 నవంబరులో కరీంనగర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో బ్లాక్‌బెల్ట్‌లో ఫస్ట్‌డాన్‌గా గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. ఈఏడాది మే 7 నుంచి 12వతేదీ వరకు మలేషియాలో జరిగే అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభ చూపే అవకాశం దక్కించుకుంది.

**అమ్మ ప్రోత్సాహం.. మాస్టర్ కృషి**

మా నాన్న మా కుటుంబానికి దూరంగా ఉంటున్నా.. మా అమ్మ కూలీ పనిచేస్తూ అక్క పెళ్లి చేసి, నన్ను చదివిస్తోంది. ఆడపిల్లకు కరాటే పోటీలు అవసరమా అని బంధువులు, ఇరుగుపొరుగువారు సూటిపోటీ మాటలతో ప్రశ్నించేవారు. ఇది మనోవేదనకు దారితీసినా.. కరాటే మాస్టర్ సమ్మయ్య నచ్చజెప్పి మళ్లీ శిక్షణ ఇచ్చారు.

ఆడవాళ్లు అంటే కుటుంబానికే పరిమితం కాదనే పట్టుదలతో కరాటేలో రాణిస్తున్నా. మలేషియాలో జరిగే పోటీల్లో మెడల్ సాధించడమే లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తున్నా. నా ప్రతిభ నాలాంటి ఆడపిల్లల కుటుంబాలకు ఆదర్శంగా నిలవాలి.

# కోల్‌కతా చేతిలో చిత్తుగా ఓడిన హైదరాబాద్

**కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 80 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది.**

**కోల్‌కతా:** ఐపీఎల్ 18 లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు హ్యాట్రిక్ ఓటమి. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్ 80 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. 201 పరుగుల భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ 16.4 ఓవర్లలో 120 పరుగులకే కుప్పకూలింది. క్లాసెన్ (33: 21 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. మెండిస్ (27: 20 బంతుల్లో 1 ఫోర్లు, 2 సిక్స్‌లు) పరుగులు చేశాడు. మిగతావారు దారుణంగా విఫలమయ్యారు. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా 3, వరుణ్ చక్రవర్తి 3, రస్సెల్ 2, హర్షిత్ రాణా, సునిల్ నరైన్ ఒక్కో వికెట్ తీశారు.



**పెవిలియన్‌కు క్యూ కట్టిన బ్యాటర్లు..**

201 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ ఏ దశలోనూ విజయం దిశగా పయనించలేదు. తొలి ఓవర్ రెండో బంతికే వికెట్ కోల్పోయింది. వైభవ్ అరోరా బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్ (4) క్యాచ్ ఔటయ్యాడు. రెండో ఓవర్‌లో మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (2) పెవిలియన్ చేరాడు. మూడో ఓవర్ తొలి బంతికి ఇషాన్ కిషన్ (2)ను వైభవ్ అరోరా ఇంటికి పంపించాడు. దీంతో ఆ జట్టు 9 పరుగులకే మూడు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే ఐదో ఓవర్లో నితీశ్ రెడ్డి రెండు ఫోర్లు, ఒక సిక్స్ కొట్టగా, మరో బ్యాటర్ మెండిస్ ఏడో ఓవర్లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టడంతో హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో ఒక్కసారిగా ఊపువచ్చింది. అయితే అదే ఓవర్ నాలుగో బంతికి రస్సెల్ బౌలింగ్‌లో నితీశ్ రెడ్డి (19: 15 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్) ఔటయ్యాడు. దీంతో తీవ్రమైన ఒత్తిడికిలోనైన ఎస్ఆర్‌హెచ్‌కు పరుగులు రాబట్టడం గగనమైంది. నరైన్ బౌలింగ్‌లో మెండిస్ ఔటయ్యాడు. పది ఓవర్లకు హైదరాబాద్ స్కోర్ 72/5. ఓవైపు లక్ష్యం ఎక్కువే ఉన్నప్పటికీ.. క్రీజులో హిట్టర్ క్లాసెన్, కమిన్స్ ఉండడంతో అభిమానుల్లో ఆశలు మిగిలేఉన్నాయి. ఈ దశలో 14వ ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు బాదిన క్లాసెన్.. ఆ తర్వాతి ఓవర్లో అరోరాకు చిక్కాడు. భారీ షాట్ క్రమంలో అలీ క్యాచ్ పట్టడంతో పెవిలియన్ చేరాడు. దీంతో హైదరాబాద్ ఓటమి ఖరారైంది. ఇక 16 ఓవర్లో వరుణ్ చక్రవర్తి తొలి రెండు బంతులకు కమిన్స్, సిమర్జిత్ సింగ్‌ను ఔట్ చేశాడు. చివరి వికెట్‌ను రస్సెల్ తీశాడు. దీంతో 16.4 ఓవర్లలోనే ఎస్ఆర్‌హెచ్ కథ ముగిసింది.

**తొలుత టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్ (60; 29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), రఘువంశీ (50; 32 బంతుల్లో 2 సిక్సులు, 5 ఫోర్లు) చెలరేగారు. కెప్టెన్ అజింక్య రహానే (38; 27 బంతుల్లో 4 సిక్సులు, ఒక ఫోర్), రింకుసింగ్ (32*; 17 బంతుల్లో ఒక సిక్స్, నాలుగు ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. చివరి బంతికి రస్సెల్ (1) రనౌటయ్యాడు. డికాక్ (1), నరైన్ (7)లు నిరాశపర్చారు. సన్‌రైజర్స్ బౌలర్లలో షమీ, కమిన్స్, జీషన్ అన్సారీ, హర్షల్ పటేల్, కమిందు మెండిస్ తలో వికెట్ తీశారు.**

# ఊహకందని రికార్డును సొంతం చేసుకున్న ఇషాంత్ శర్మ

**గుజరాత్ వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ ఊహకందని ఐపీఎల్ రికార్డును సొంతం చేసుకున్నాడు. 2025 సీజన్‌లో భాగంగా నిన్న (ఏప్రిల్ 2) ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు కెప్టెన్ రజత్ పాటిదార్ వికెట్ తీసిన ఇషాంత్.. 18 ఏళ్ల తేడాతో ఒకే ఫ్రాంచైజీ కెప్టెన్లను ఔట్ చేసిన అరుదైన ఘనతను సాధించాడు. తొలి ఐపీఎల్ సీజన్‌లో (2008) నాటి ఆర్సీబీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్‌ను ఔట్ చేసిన ఇషాంత్.. తాజాగా అదే ఫ్రాంచైజీ ప్రస్తుత కెప్టెన్ రజత్ పాటిదార్‌ను పెవిలియన్‌కు పంపాడు.**



ఐపీఎల్ చరిత్రలో ఇలాంటి రేర్ ఫీట్‌ను ఎవరూ సాధించలేదు. 18 ఏళ్ల తేడాతో ఒకే ఫ్రాంచైజీ కెప్టెన్లను ఔట్ చేసిన తొలి మరియు ఏకైక బౌలర్ ఇషాంత్ శర్మనే. 2008 సీజన్‌లో కేకేఆర్ తరఫున ఆడుతూ తన స్పెల్ తొలి ఓవర్‌లోనే నాటి ఆర్సీబీ కెప్టెన్‌ను ఔట్ చేసిన ఇషాంత్ శర్మ.. ఐపీఎల్ 2025 సీజన్‌లో ప్రస్తుత ఆర్సీబీ కెప్టెన్‌ను కూడా తన స్పెల్ తొలి ఓవర్‌లోనే పెవిలియన్‌కు పంపాడు.

**మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బౌలర్లు, ఆతర్వాత బ్యాటర్లు చెలరేగడంతో ఆర్సీబీపై గుజరాత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. లివింగ్‌స్టోన్ (40 బంతుల్లో 54; ఫోర్, 5 సిక్సర్లు), టిమ్ డేవిడ్ (18 బంతుల్లో 32; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), జితేశ్ శర్మ (21 బంతుల్లో 33; 5 ఫోర్లు, సిక్స్) పోరాడటంతో నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది.**

అప్పుడూ, ఇప్పుడూ ఆర్సీబీ కెప్టెన్లను ఔట్ చేసింది చిన్నస్వామి స్టేడియంలోనే కావడం మరో విశేషం. ఇక్కడ ఒకే ఒక్క తేడా ఏంటంటే.. నాడు తన స్పెల్ తొలి బంతికే ఆర్సీబీ కెప్టెన్‌ను ఔట్ చేసిన ఇషాంత్.. ప్రస్తుత సీజన్‌లో తన స్పెల్ రెండో బంతికి ఆర్సీబీ కెప్టెన్‌ను పెవిలియన్‌కు పంపాడు. ఐపీఎల్ ఆరంభ సీజన్ నుంచి ఆడుతున్న అతి తక్కువ మంది ఆటగాళ్లలో ఇషాంత్ ఒకడు. 36 ఏళ్ల ఈ ఢిల్లీ పేసర్ 2018 సీజన్ మినహాయించి ప్రతి ఐపీఎల్‌లో ఆడాడు.

గుజరాత్ బౌలర్లలో సిరాజ్ 3 వికెట్లు తీసి ఆర్సీబీకి దెబ్బకొట్టాడు. సిరాజ్‌తో పాటు సాయికిషోర్ (2), అర్షద్ ఖాన్ (1), ప్రసిద్ధ్ కృష్ణ (1), ఇషాంత్ శర్మ (1) కూడా వికెట్లు తీశారు. సిరాజ్ తన కోటా 4 ఓవర్లలో కేవలం 19 పరుగులు మాత్రమే ఇచ్చాడు.

అనంతరం 170 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన గుజరాత్ 17.5 ఓవర్లలో కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. జోస్ బట్లర్ (39 బంతుల్లో 73 నాటౌట్; 5 ఫోర్లు, 6 సిక్సర్లు), సాయి సుదర్శన్ (36 బంతుల్లో 49; 7 ఫోర్లు, సిక్స్), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (18 బంతుల్లో 30 నాటౌట్; ఫోర్, 3 సిక్సర్లు) నిలకడగా ఆడి గుజరాత్‌ను గెలిపించారు.

## నాకు అలాంటి అవకాశం వచ్చింది
# మౌనం వీడిన యశస్వి జైస్వాల్

**ప్రస్తుతం యశస్వి జైస్వాల్ రాజస్థాన్ రాయల్స్ తరఫున ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. దేశవాళీలో మాత్రం ఇకపై ముంబయి నుంచి వేరే జట్టుకు మారిపోయాడు.**

**వ్యక్తిగత కారణాలతో దేశవాళీ క్రికెట్‌లో ముంబయి జట్టును యశస్వి జైస్వాల్ వీడిన సంగతి తెలిసిందే. ఒక్కసారిగా అతడు ఈ నిర్ణయం తీసుకోవడంతో క్రికెట్ ప్రపంచం నివ్వెరపోయింది. ముంబయి జట్టులో అదరగొట్టి టీమ్‌ఇండియాలో చోటు దక్కించుకున్నాడు. తాను ముంబయిని వీడటానికి కారణమేంటో యశస్వి వెల్లడించాడు. గోవా నుంచి తనకు మంచి ఆఫర్ వచ్చిందని తెలిపాడు. టీమ్‌ఇండియా మ్యాచులు లేనప్పుడు దేశవాళీలో ఆడేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని పేర్కొన్నాడు.**



''ఈ నిర్ణయం తీసుకోవడం చాలా కష్టంగా అనిపించింది. నేను ఇలా ఉండటానికి కారణం ముంబయి. ఈ నగరమే నన్ను ఇలా మార్చింది. నా జీవితాంతం ముంబయి క్రికెట్ అసోసియేషన్‌కు రుణపడి ఉంటా. గోవా నాకు ఓ అద్భుతమైన అవకాశం ఇచ్చింది. నాయకత్వ పాత్ర పోషించాలని అడిగింది. అయితే, ఎప్పటికీ నా తొలి ప్రాధాన్యం టీమ్‌ఇండియాదే. జాతీయ జట్టుకు ఆడనప్పుడు మాత్రం తప్పకుండా గోవాకు ఆడతా. టోర్నీ ఆసాంతం ఆడేందుకు ప్రయత్నిస్తా. నాకు వచ్చిన ఛాన్స్‌ను అందిపుచ్చుకోవడానికి ఎప్పుడూ ముందుంటా'' అని జైస్వాల్ వెల్లడించాడు.

**అవన్నీ రూమర్లే: సూర్యకుమార్**

యశస్వి జైస్వాల్ బాటలోనే సూర్యకుమార్ యాదవ్ కూడా బయటకొస్తాడని కథనాలు వచ్చాయి. అయితే, వాటిపై సూర్య స్పందించాడు. ''ఈ కథనాలను సిద్ధం చేసిన వ్యాక్తి స్క్రిప్ట్ రైటరా? లేదా జర్నలిస్టా? అలాగేతై ఇక నుంచి నేను కామెడీ సినిమాలను చూడటం మానేసి ఈ ఆర్టికల్స్‌ను చదవడం ప్రారంభిస్తా. ఇవన్నీ అర్థరహితమైన కథనాలు'' అని సూర్య పోస్టు పెట్టాడు.

భారత క్రికెటర్లు దేశవాళీలో ఆడటాన్ని బీసీసీఐ తప్పనిసరి చేయడంతో ఈ ఏడాది జనవరి 2325 వరకు జమ్మూకశ్మీర్‌తో జరిగిన రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ముంబయి తరఫున యశస్వి చివరిసారిగా బరిలో దిగాడు. ఈ మ్యాచ్‌లో ముంబయి ఓడిపోగా.. యశస్వి వరుసగా 4, 26 పరుగులు సాధించాడు. ''యశస్వి గోవాకు ఆడాలని అనుకుంటున్నాడు. అతడిని మేం స్వాగతిస్తున్నాం. వచ్చే సీజన్ నుంచి అతను గోవాకు ఆడతాడు. భారత జట్టు విధులు లేనప్పుడు గోవాకు యశస్వి సారథ్యం వహించొచ్చు'' అని గోవా క్రికెట్ సంఘం కార్యదర్శి శంబా దేశాయ్ పేర్కొన్నాడు. 202223 సీజన్‌కు ముందు అర్జున్ తెందుల్కర్, సిద్ధేష్ లాడ్ కూడా ముంబయిని వీడి గోవా జట్టులో చేరారు.



## అదరగొట్టిన వెంWకటేశ్ అయ్యర్..
## హైదరాబాద్ లక్ష్యం 201

**ఐపీఎల్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 200 పరుగులు చేసింది.**

**కోల్‌కతా:** ఐపీఎల్ 2025 లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడుతున్నాయి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 200 పరుగులు చేసింది. చివరి ఓవర్లలో వెంకటేశ్ అయ్యర్ మెరుపు ఇన్నింగ్స్ (60; 29 బంతుల్లో మూడు సిక్సులు, ఏడు ఫోర్లు) ఆడాడు. 25 బంతుల్లోనే అర్ధ శతకం బాదాడు.

రఘువంశీ సైతం అర్ధ సెంచరీ (50; 32 బంతుల్లో రెండు సిక్సులు, ఐదు ఫోర్లు)తో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ అజింక్య రహానే (38; 27 బంతుల్లో 4 సిక్సులు, ఒక ఫోర్), రింకుసింగ్ (32*; 17 బంతుల్లో ఒక సిక్స్, నాలుగు ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. చివరి బంతికి రస్సెల్ (1) రనౌటయ్యాడు. డికాక్ (1), నరైన్ (7)లు నిరాశపర్చారు. సన్‌రైజర్స్ బౌలర్లలో షమీ, కమిన్స్, జీషన్ అన్సారీ, హర్షల్ పటేల్, కమిందు మెండిస్ తలో వికెట్ తీశారు.